అశోక్ నగర్‌లో రాజ్యమేలిన పోలీసు బలగం

నిరుద్యోగులపై విరిగిన లాఠీ

విచక్షణా రహితంగా పోలీసు రణ రంగం

మద్దతుగా నిల్చిన బీఆర్ఎస్ నేతల అరెస్ట్

జీవో నం. 29ను రద్దు చేయాలని, గ్రూప్ – 1 పరీక్షలను రీ షెడ్యూల్ చేయాలని విద్యార్థులు, ఉద్యోగార్థులు శనివారం రోడ్లెక్కారు. గత కొన్ని రోజులుగా ఈ తతంగం నడుస్తున్నప్పటికీ ప్రభుత్వ తీరులో ఎలాంటి మార్పు లేదు. దున్నపోతు మీద వర్షం పడ్డ చందంగా ప్రభుత్వ పోకడలు ఉండటంతో నిరుద్యోగులు పరీక్షల రీషెడ్యూల్‌పై పట్టు విడవకుండా పోరు సల్పారు. రెండు రోజులుగా నిరుద్యోగ యువత వీపులపై పోలీసుల లాఠీలు తాండవం చేస్తున్న విషయం తెలిసిందే. కాగా, నగరంలోని అశోక్ నగర్‌లో శనివారం పోలీసు బలగం రాజ్యమేలింది. విద్యార్థుల వ్యవహారాన్ని పక్కనబెట్టి వారు రణరంగం సృష్టించారు. మరోమారు నిరుద్యోగులపై పోలీసు లాఠీ ముక్కలుగా విరిగింది. గ్రూప్ –1 పరీక్షలు ఈ నెల 21 నుంచి నిర్వహించనుండటంతో అశోక్ నగర్‌లో వేలాదిగా నిరుద్యోగులు గుమికూడారు. పరీక్షలను రీ షెడ్యూల్ చేసేందుకు సెక్రటేరియట్ ముట్టడే ప్రధాన ఆయుధంగా పెట్టుకొని ఆ దిశగా ప్లకార్డులు చేబూని, పెద్ద పెట్టున ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తూ ర్యాలీగా వస్తున్న నిరుద్యోగులపై పోలీసులు మరోసారి తమ ప్రతాపాన్ని చూపారు. ఇష్టారాజ్యంగా తమ లాఠీలకు పని కల్పించారు. నిరుద్యోగుల వీపులపై పోలీసుల లాఠీ శివ తాండవం చేసింది. ఈ నేపథ్యంలో వందలాది మంది నిరుద్యోగులకు గాయాలయ్యాయి. ఈ తరుణంలో నిరుద్యోగులకు మద్దతుగా నిల్చిన బీఆర్ఎస్ నేతలపై కూడా పోలీసులు విచక్షణా రహితంగా ప్రవర్తించారు. ఎంతో మంది నాయకులను అరెస్ట్ చేసి స్థానిక పోలీసు స్టేషన్లకు తరలించారు.

తన పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ని కలిసి ఆశీర్వాదం తీసుకున్న ఉద్యమ గాయని వొల్లాల వాణి

తన కుమారుడు చరిశ్ పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని నివాసంలో శనివారం ఆశీర్వాదం తీసుకున్న వేద రజినీ సాయిచంద్

డిస్టోనియా రోగికి నిమ్స్ పునర్జన్మ

ఖైరతాబాద్, అక్టోబర్ 19: మెదడుకు సంబంధించిన అరుదైన డిస్టోనియా వ్యాధితో బాధపడుతున్న రోగికి నిమ్స్ దవాఖాన పునర్జన్మనిచ్చింది. నగరానికి చెందిన చెవిటి, మూగ వ్యక్తి అయిన దివ్యాంగుడు (23) గత కొంత కాలంగా కాళ్లు, చేతులు కొట్టుకుంటూ, కనీసం తినలేని పరిస్థితిలో, తీవ్రమైన నొప్పితో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు ఎన్నో దవాఖానాల్లో చూపించినా ఫలితం లేదు. కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ దవాఖానలు చికిత్సకు లక్షలాది రూపాయల ఫీజులు డిమాండ్ చేశారు. దీంతో ఇటీవల ఆ యువకుడిని కుటుంబ సభ్యులు నిమ్స్‌కు తీసుకువచ్చారు. వివిధ పరీక్షలు నిర్వహించిన వైద్యులు వ్యాధిని అరుదైన డిస్టోనియాగా గుర్తించారు. సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ ఎర్రమనేని వంశీ కృష్ణ, సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ శిరీష నేతృత్వంలో ఆధునిక చికిత్స విధానమైన డీప్ బ్రెయిన్ స్టిమ్యూలేషన్ థెరపితో చికిత్సను అందించారు. ఆ క్రమంలో ఆ యువకుడు కోలుకొని సాధారణ స్థితికి చేరుకున్నాడు. పుట్టుకతో తీవ్ర నరకాన్ని చూసిన ఆ యువకుడికి నిమ్స్ పునర్జన్మను ఇచ్చింది. అయితే, లక్షలాది రూపాయల ఖరీదు చేసే ఈ చికిత్సను ఉచితంగా ఆరోగ్యశ్రీ పథకంలో పూర్తిగా నిర్వహించడం విశేషం.

ఖరీదైన చికిత్స ఉచితం: నిమ్స్ డైరెక్టర్

డిస్టోనియా, పార్కిన్ సన్ లాంటి మెదడు సంబంధిత వ్యాధులకు చికిత్స ఎంతో ఖరీదైనదై ఉంటుంది. ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటళ్లలో లక్షలాది రూపాయలు చికిత్సకు ఫీజు రూపంలో తీసుకుంటారు. కానీ, ప్రభుత్వం ఈ చికిత్సను పేదలకు ఉచితంగా అందిస్తుందని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప వివరించారు.

చికిత్సకు ముందు

చికిత్స తర్వాత

మానసిక ధైర్యంతో క్యాన్సర్‌ను జయించొచ్చు

హీరోయిన్ సోనాలీ బింద్రే

బంజారాహిల్స్, అక్టోబర్ 19: క్యాన్సర్ వ్యాధితో పోరాడేందుకు మానసికంగా దృఢంగా ఉండాలని, సరైన సమయంలో చికిత్సను ప్రారంభిస్తే దాన్ని జయించవచ్చని బాలీవుడ్ హీరోయిన్ సోనాలి బేంద్రె అన్నారు. రొమ్ము క్యాన్సర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా జూబ్లీహిల్స్‌లోని జీవీకే హెల్త్ హబ్‌లో శనివారం చర్చా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్యాన్సర్‌ను జయించిన హీరోయిన్ సోనాలి బేంద్రె హాజరై తన అనుభవాలను పంచుకున్నారు. క్యాన్సర్ సోకిన తర్వాత ఒక్కసారిగా తీవ్రమైన భయం, నిరాశ కలిగాయని, కుటుంబ సభ్యులు, స్నేహితులు ఇచ్చిన మద్దతులో ధైర్యం కూడగట్టుకుని పోరాటం ప్రారంభించానన్నారు. క్యాన్సర్ సోకిన తర్వాత శరీరంపై తీవ్రమైన ప్రభావం పడడంతో పాటు మానసికంగా కూడా కుంగిపోయే పరిస్థితి వస్తుందన్నారు. అయితే, ఆత్మీయులు అందించే ప్రేమ, కేరింగ్, సానుకూల దృక్పథంతో క్యాన్సర్‌ను జయించవచ్చన్నారు. గతంలో క్యాన్సర్ అనే మాట వింటేనే వణికిపోయే పరిస్థితి ఉండేదని, అయితే, ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన చికిత్సా విధానాలపై అవగాహన పెరగడంతో క్యాన్సర్‌ను జయించవచ్చనే నమ్మకం కలిగిందన్నారు. ప్రతి ఒక్కరు క్యాన్సర్ స్క్రీనింగ్‌ను రెగ్యులర్‌గా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పింకీ రెడ్డి, డా. స్నేహ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో సినీ నటి సొనాలీ బేంద్రె, పింకీ రెడ్డి

అండెం వెంకట్ రెడ్డి దంపతులకు సన్మానం చేస్తున్న జస్టిస్ నగేశ్ భీమపాక, డాక్టర్ సుద్దాల అశోక్ తేజ తదితరులు

నిజమైన ప్రజాకవి సుద్దాల హనుమంతు

చిక్కడపల్లి, అక్టోబర్ 19: జీవిత పర్యంతం వస్తువులే అస్తి పాస్తులుగా నమ్మిన నిజమైన ప్రజా కవి సుద్దాల హనుమంతు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. తుది శ్వాస వరకు ఆఖరి పోరాటం ఆపని నిజాయితీ నిబద్ధత కలిగిన ఆదర్శనీయ ప్రజాకవి, కళాకారుడని వారు హనుమంతును కొనియాడారు. సుద్దాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుద్దాల హనుమంతు –జానకమ్మ జాతీయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం సాయంత్రం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక, కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పిల్లమర్రి రాములు, ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలుగు శాఖ మాజీ అధిపతి సూర్య ధనుంజయ్ తదితరులు హాజరయ్యారు. సుద్దాల హనుమంతు – జానకమ్మ పురస్కారాన్ని అరుణోదయ నాగన్నకు ప్రదానం చేశారు. అదే విధంగా ఫౌండేషన్ అధ్యక్షుడు సుద్దాల అశోక్ తేజ బాల్య స్నేహితులు అండెం వెంకట్ రెడ్డికి, బీసు బిక్షపతిలకు ప్రత్యేక సన్మానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక మాట్లాడుతూ ప్రతి జీవిలో ప్రతిఘటన, చైతన్యం ఉంటుందన్నారు.

144 మంది పేదలకు డబుల్ బెడ్ రూం పట్టాలు

సిటీబ్యూరో, అక్టోబర్ 19(నమస్తే తెలంగాణ): గోషామహల్ నియోజకవర్గానికి చెందిన 144 మంది పేదలకు డబుల్ బెడ్ రూం పట్టాలను రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు హైదరాబాద్ కలెక్టరేట్‌లో శనివారం అందించారు. కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎమ్మెల్యే రాజాసింగ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసిన కార్మిక సంఘం

సిటీబ్యూరో, అక్టోబర్ 19(నమస్తే తెలంగాణ): తెలంగాణ స్వచ్ఛ ఆటో టిప్పర్ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలమడుగు రాజేందర్ నేతృత్వంలో కార్మికులు జీహెచ్ఎంసీ నూతన కమిషనర్ ఇలంబర్తిని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వారి వెంట యూనియన్ జీహెచ్ఎంసీ అధ్యక్షులు కాట్రావత్ గోపాల్ నాయక్, హంసరాజు, అర్జున్, పెద్ద నరసింహ, బాలు, పరశురాం, రామ, ప్రభాకర్, తిరుమలేశ్ ఉన్నారు.

22 నుంచి ఎన్ఐఓఎస్ సెకండరీ, సీనియర్ సెకండరీ పరీక్షలు

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 19: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెనింగ్ స్కూల్ (ఎన్ఐఓఎస్) సెకండరీ, సీనియర్ సెకండరీ థియరీ పరీక్షలు అక్టోబర్ 22 నుంచి నవంబర్ 29వరకు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం సంచాలకులు పరంప్రీత్ సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. థియరీ పరీక్షల తేదీలకు సంబంధించిన షెడ్యూలు తదితర వివరాలకు www.nios.ac.in వెబ్‌సైట్‌లో పొందుపర్చబడ్డాయని, హాల్ టికెట్లను కూడా డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు వెబ్‌సైట్‌ను సందర్శించి పరీక్షా కేంద్రాన్ని నిర్ధారించుకోవాలని పేర్కొన్నారు. ఏదైనా సమస్య ఏర్పడితే ఫోన్ నం. 040-2475 2859, 2475 0712లలో సంప్రదించవచ్చని వెల్లడించారు.

గ్రేటర్‌కు రాగల రెండు రోజుల వర్ష సూచన

సిటీబ్యూరో, అక్టోబర్ 19(నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో నగరానికి ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీచేశారు. ఇదిలా ఉండగా, నగరంలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు 31.6 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 23.0 డిగ్రీలు, గాలిలో తేమ 63 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

టీజీవోస్ జిల్లా అధ్యక్షుడిగా ఎం.బి.కృష్ణ ఎన్నిక ఏకగ్రీవం

సిటీబ్యూరో, అక్టోబర్ 19(నమస్తే తెలంగాణ): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడిగా ఎంబీ కృష్ణ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాంపల్లిలోని టీజీవోస్ భవనంలో శనివారం టీజీవోస్ హైదరాబాద్ జిల్లా శాఖ ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణల సమక్షంలో జరిగిన ఈ ఎన్నికల్లో రెండు రెవెన్యూ డివిజన్లు, 16 మండలాల 55 ప్రభుత్వ కార్యాలయాల యూనిట్స్‌తో కలిపి 3,200 మంది సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు

- బాధ్యతలు స్వీకరించిన వీసీలు

వ్యవసాయ యూనివర్సిటీ, అక్టోబర్ 19: వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని వ్యవసాయ యూనివర్సిటీ నూతన వీసీగా పదవీ బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీకి ఉప కులపతిగా ఎంపికైన అల్దాస్ జానయ్య శనివారం ఆయన పరిపాలనా భవన్‌లో బాధ్యతలు చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం తనకు అప్పగించిన బాధ్యతను నెరవేరుస్తానని ఆయన అన్నారు. ఇన్‌చార్జి ఉప కులపతి, వ్యవసాయ ప్రిన్సిపల్ కార్యదర్శి రఘునందన్ రావు ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సాగుకు ప్రత్యేక ప్రాధాన్యత నిచ్చిందని గుర్తుచేశారు. ఆధునిక టెక్నాలజీ, నూతన విధ్యావిధానం తదితర విప్లవాత్మక మార్పులు వచ్చాయని తెలిపారు. నల్గొండ జిల్లాకు చెందిన డా.జానయ్య వ్యవసాయ ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్, పోస్టు డాక్టరేట్, ఫెలో, తత్వవేత్త అవార్డులు పొందారు. 23 ఏళ్లు జాతీయ అంతర్జాతీయ సంస్థలో, ప్రస్తుతం అనుబంధ పీఠాధిపతి అసోసియేట్ డీన్, వ్యవసాయ కళాశాల జగిత్యాలలో పని చేస్తున్నారు. దిన పత్రికల్లో దాదాపు 100, అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థచే ఉత్తమ శాస్త్రవేత్త(2002) అవార్డు, ఏపీ ప్రభుత్వ ఉత్తమ శాస్త్రవేత్త (2012) అవార్డు , ఎకాడమిక్ లీడర్ షిప్ (2019) పొందారు.

వీసీగా బాధ్యతలు చేపట్టిన డా. జానయ్య



ఓయూ వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ ఎం. కుమార్

వర్సిటీ ప్రతిష్ట పెంపొందించేందుకు కృషి: ప్రొ. ఎం. కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ నూతన వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ మొలుగారం కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పరిపాలనా భవనంలోని తన చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లాంఛనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం, సెనేట్ హాల్‌లో అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 107 వసంతాల ఓయూకు వీసీగా అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు. ఓయూలోనే విద్యాభ్యాసం చేసి, ఇక్కడే అధ్యాపకుడిగా పని చేస్తూ, వీసీగా బాధ్యతలు చేపట్టడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు ఉన్న ఓయూ ఖ్యాతిని నిలబెడుతూ, ప్రతిష్టను మరింత పెంపొందించడమే ధ్యేయంగా పనిచేస్తానని చెప్పారు.

పటాన్‌చెరులో జంట రిజర్వాయర్ల ట్రయల్ రన్

సిటీబ్యూరో, అక్టోబర్ 19(నమస్తే తెలంగాణ): పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఉస్మాన్ నగర్‌లో జల మండలి చేపట్టిన 4 ఎంఎల్, 2 ఎంఎల్ సామర్థ్యం కలిగిన జంట రిజర్వాయర్ల ట్రయల్ రన్‌ను శనివారం నిర్వహించారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో తాగునీటి సరఫరా కోసం జల మండలి చేపట్టిన ఓఆర్ఆర్ ప్రాజెక్ట్ ఫేజ్-2, ప్యాకేజీ-2లో ఉన్న ఈ రిజర్వాయర్లను నవంబర్ మొదటి వారంలోగా ప్రారంభానికి సిద్ధం చేయాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు 2 ఎంఎల్ రిజర్వాయర్ ఇన్‌లెట్, ఔట్‌లెట్ పూర్తయ్యాయని, 4 ఎంఎల్ రిజర్వాయర్‌కు సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేస్తామని చెప్పారు. ఉస్మాన్ నగర్‌కు చెందిన వాటర్ ఆడిట్‌ను ప్రారంభించాలని ప్రయోగాత్మకంగా ఈ రిజర్వాయర్ల నుంచి సరఫరా చేస్తున్న ప్రతి చుక్కను లెక్క కట్టేలాగా ఫ్లో మీటర్‌ను పెట్టి, చివరి వినియోగదారుని వద్ద కూడా మీటర్ రీడింగ్ సరిపోయేలా లెక్కకడితే ట్రాన్స్‌మిషన్ లాస్ తెలుస్తుందని చెప్పారు.